యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమలో సిఐడి తనిఖీలు

విశాలాంధ్ర-రణస్థలం: యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమలో సిఐడి తనిఖీలు నిర్వహించారు. బీరు తయారీ కంపెనీలో దస్త్రాలను 20 మంది సీఐడీ బృందం పరిశీలించారు. మండలంలో జాతీయ రహదారి అనుకున్న యుబి పరిశ్రమంలో బుధవారం సిఐడి బృందాలు పరిశ్రమలో ఉన్న 2019 నుంచి జరుగుతున్న వ్యాపార లావాదేవీలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో యూపీ పరిశ్రమలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణ మేరకు ఈ బృందాలు రికార్డులన్నీ పరిశీలిస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఈ పరిశ్రమల్లో తనిఖీలు జరుగుతున్నాయి.

డాక్టర్ సీదిరి అప్పలరాజుకు అస్వస్థత

విశాలాంధ్ర - పలాస: రాష్ట్ర మాజీ మంత్రి, పలాస నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఉదయం తన ఇంట్లో అధిక సమయం వ్యాయామం చేయడంతో అలసటకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. డా. సీదిరి స్వతహాగా వైద్యుడు కావడంతో తక్షణమే స్పందించి వెంటనే శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి వెళ్ళి గుండె సంబంధిత (యాంజిగ్రాం), సీటీ స్కాన్ పరీక్షలు చేయించుకున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు డా.అన్నాజీరావు తెలిపారు. డా. అప్పలరాజు అస్వస్థతకు గురి కావడంతో ఆయన అభిమానులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

జాతీయ రహదారిపై విద్యుత్ వెలుగులు

విశాలాంధ్ర - రణస్థలం: మండల కేంద్రం జాతీయ- 16 రహదారిపై గత కొన్నాళ్లుగా చీకటి మయంగా ఉండి అనేక ప్రమాదాలకు కారణం అవుతున్న విషయాన్ని స్థానిక జెఆర్‌పురం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావడంతో.. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు నేషనల్ హైవే అథారిటీ అధికారులను క్యాంప్ కార్యాలయానికి పిలిపించి, వారితో చర్చించి పరిష్కార మార్గం సూచించారు. దాని ఫలితంగా బుధవారం ముఖ్య కూడలి కలిగిన రామతీర్థం జంక్షన్, సీఐ ఆఫీస్ జంక్షన్, పాత పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద విద్యుత్ దీపాలను జాతీయ అథారిటీ అధికారులు

ఏర్పాటు చేశారు. వాటిని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించి రణస్థలం జాతీయ రహదారిపై వెలుగులు నింపారు. దీనిపై వ్యాపారులు, స్థానికులు, గ్రామస్తులు, నాయకులు ఎమ్మెల్యేకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అథారిటీ అధికారులు, కూటమి నాయకులు డీజీఎం ఆనందరావు, పిసినీ జగన్నాథం నాయుడు, లంక ప్రభాకర్, నరయనసెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రమాద బీమా పరిహారానికి చెల్లుచీటి..!

విశాలాంధ్ర-సోంపేట: ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తులకు ప్రభుత్వం చెల్లించే బీమా పరిహార ప్రయోజనానికి చెల్లు చీటి పడినట్టే. రోడ్డు ప్రమాదాలు, విద్యుత్, పాముకాటు, తదితర ప్రమాద సందర్భాల్లో మృతి చెందిన వారికి గతంలో వైఎస్సార్ బీమా పేరిట లక్ష రూపాయలు ప్రభుత్వం అందించేది. ప్రస్తుతం అటువంటి ప్రయోజనం అందక బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురౌతున్నాయి. 69 ఏళ్లలోపు ప్రమాద బాధితులకు ఇటువంటి సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలో ఇటీవల తాళ్ల లోకనాథం అనే వ్యక్తి బెండకాయలు ఏరుతూ పాముకాటుకు గురై మృతి చెందిన విషయం తెల్సిందే. అటువంటి కుటుంబానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం బీమా చెల్లించకపోవడంతో ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. బీమా పరిహారం కోసం గ్రామ సచివాలయానికి వెళ్లి ఆరా తీయగా ప్రస్తుతం అటువంటి పథకం అమలులో లేదంటూ సిబ్బంది సమాధానం ఇవ్వడంతో ఆ కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర బీసీ సంఘాల కార్యదర్శి బీన ఢిల్లీరావు, జింకిభద్రకు చెందిన వైకాపా నేత సాహుకారి జానకిరావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా బీమా పరిహారం అందని విషయం తెలుసుకుని ప్రభుత్వ

తీరును తప్పుబట్టారు. సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని ఎన్నికల్లో హామీలు గుప్పించిన నేతలు గద్దెనెక్కిన తర్వాత హామీలను విస్మరించి పేదలను పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బ్రిలియంట్‌లో సందడిగా దీపావళి పండగ

విశాలాంధ్ర - టెక్కలి: స్థానిక బ్రిలియంట్ స్కూల్లో బుధవారం సందడి వాతావరణంలో దీపావళి పండగను ప్రిన్సిపాల్ శోభారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో దీపావళి ముగ్గులతో అలంకరించి వాటి మధ్య దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి పండగ విశిష్టత గురించి వివరించారు. చీకటిలో అందంగా కాంతులను వికసిస్తూ ఆహ్లాద వాతావరణంలో జరుపుకునే పండగే దీపావళి పండగని అన్నారు. చిన్నపిల్లలు మందుగుండి సామాగ్రి కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ఉపయోగించాలని, తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకొని దీపావళి పండగను ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు సన్నాహాలు



విశాలాంధ్ర - ఇచ్ఛాపురం: నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి నియోజకవర్గానికి వస్తుండటంతో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌తోపాటు పార్టీ శ్రేణులు, కూటమి వర్గాలు, అధికారులు అతని పర్యటనను ప్రతిష్టాత్మకంగా భావించి యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకం ద్వారా ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళిని పురస్కరించుకుని ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యమంత్రి గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం -దీపం 2.0 ప్రారంభానికి ఈదుపురం గ్రామం వద్ద సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, సభా వేదికలను బుధవారం ఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఇతర పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. దీపావళి పండుగ ఉన్నా అధికారులు ముఖ్యమంత్రి కార్యాక్రమాన్ని జయప్రదం చేయడానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ అన్నారు. ముఖ్యమంత్రి నేరుగా లబ్ధిదారులతో మాట్లాడే అవకాశాలు ఉన్నందున కట్టుదిట్టమైన బద్రతా ఏర్పాట్లను సమర్ధంగా నిర్వర్తించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.

సీఏ ఇంటర్‌లో ఉత్తీర్ణత పొందిన ధనలక్ష్మి

విశాలాంధ్ర - నరసన్నపేట: చార్టెడ్ అకౌంటెంట్ ఇంటర్‌లో సవర ధనలక్ష్మి ఉత్తీర్ణత పొందారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ నరసన్నపేటలో పదవ తరగతి విజ్ఞాన్ విద్యానికేతన్‌లో చదివానని, ఇంటర్మీడియట్, సిఏ, మాస్టర్ మైండ్స్, గూంటూరులో చదివానని తెలిపారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ బాడాన నారాయణరావు, కరస్పాండెంట్ యిప్పిలి రవికుమార్, అధ్యక్షులు వంగ సత్యం, కార్యదర్శి కలివరపు రామకృష్ణ, ధనలక్ష్మి తండ్రి సవర మోహనరావు, తల్లి శ్రీ ముఖలింగం దేవాలయం మాజీ డైరెక్టర్ సవర శైలజ, ధనలక్ష్మి భర్త హైదరాబాద్‌లో ఎస్.ఐగా పనిచేస్తున్న వంగ కోటేశ్వరరావు మాట్లాడుతూ చార్టెడ్ అకౌంటెంట్‌లో ఉత్తీర్ణత పొందిన ధనలక్ష్మికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

అమ్మవారి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు



విశాలాంధ్ర - కంచిలి: మండలం కర్తలి గ్రామంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను ఉదయం 6.42 నిమషాలకు సూర్యకిరణాలు తాకాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, చుట్టుప్రక్కల గ్రామస్తులు అమ్మవారి గుడి వద్దకు చేరుకున్నారు. దీపావళి పర్వదినాన ఇలా జరగడంతో చూపురుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

సీఎం దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర - జలుమూరు: నవంబర్ 1న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అడుగుపెడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి శ్రీకాకుళం మన్యం జిల్లా పరిధి సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న పలు గ్రామాల సమస్యలను తీసుకువెళ్ళన్నామని గిరిజన ఐక్యవేదిక నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్, నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకువెళ్లినట్లు మీరు సంయుక్తంగా ముఖ్యమంత్రిని కలిసే విధంగా సహకరించాలని గిరిజనుల తరఫున లక్ష్మీనారాయణ కోరారు.

నదీతీరంలో రోడ్డు నిర్మాణం

- పరిశీలించిన ఎమ్మెల్యే గొండు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీ నుండి ఏడు రోడ్ల జంక్షన్ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర నదీ తీరంలో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని నాగావళి నది తీరంలో బుధవారం ఉదయం ఆయన రెండున్నర కిలోమీటర్ల మేర కాలినడకన పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నది గట్టుపై రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే కలెక్టర్ కమిషనర్లతో చర్చించడం జరిగిందని త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపడితే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ రోడ్డు గుండా కలెక్టరేట్‌కి వెళ్ళేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. త్వరలోనే ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తెస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రోనంకి కళ్యాణ్, కార్యకర్తలు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: నవంబరు 12 నుంచి 15వ తేదీ వరకు గురునానక్ దేవ్ యూనివర్సిటీ (అమృతసర్)లో ఆల్ ఇండియా అంతర యూనివర్సిటీ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తరఫున పాల్గొనే క్రీడాకారులను బుధవారం ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియలో వర్సిటీ, అనుబంధ కళాశాలల నుంచి 24 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఎల్.జగదీశ్వరి, ఎ.భువనేశ్వరి, యు.అను ఎంపికయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియకు న్యాయనిర్ణేతలుగా తైక్వాండో రిఫరీలు మజ్జి గౌతమ్, ఎం. సాయిబాలాజీ వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ ఇన్చార్జి డీన్ డాక్టర్ పి.రవికుమార్, క్రీడా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ పర్యవేక్షించారు.

ప్రజాదర్బార్‌కు అధికారులంతా హాజరు కావాలి

విశాలాంధ్ర - కొత్తూరు: ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధికారులంతా తప్పకుండా హాజరు కావాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు 44 అర్జీలు, పి.ఆర్ శాఖకు 109 అర్జీలు, హౌసింగ్‌కు 100 అర్జీలు, ఆర్ అండ్ బి శాఖకు 18 అర్జీలు, విద్యుత్ శాఖకు 6 అర్జీలు, సివిల్ సప్లై శాఖకు ఒక అర్జీ , ఐసీడీఎస్‌కు ఒకటి మొత్తం 282 అర్జీలు వచ్చినట్టు ఎవోపిఆర్డి బీవీ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వరప్రసాద్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ బైరాగి నాయుడు, ఎంపీడీఓ నీరజ, ఎమ్మార్వో రవిచంద్ర, టీడీపీ నేతలు ఎం.గాంధీ, ఎ.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలి

విశాలాంధ్ర - నందిగాం: కాలుష్య రహితంగా ప్రతి ఒక్కరూ దీపావళి పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో పాఠశాల ప్రాంగణంలో చక్కనైనటువంటి రంగవల్లిని వేసినట్లు పాఠశాల వ్యవస్థాపకులు మోహన్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పథకం ద్వారా ఉత్తమ బోధన

విశాలాంధ్ర - హిరమండలం: గ్రామీణ ప్రాంతంలో వయోజనులైన నిరక్షరాస్యులను అందులో కూడా ముఖ్యంగా మహిళలను గుర్తించి వారందరికీ ఉల్లాస్ పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ బోధనను అందించబోతున్నట్లు హిరమండలం వెలుగు ఏ.పి.ఎం. పైడి కూర్మారావు తెలిపారు. కేవలం అక్షర జ్ఞానమే కాకుండా వారికి సమాజంలో అవసరమైన సామాజిక, ఆర్థిక అక్షరాస్యతతోపాటు డిజిటల్ ఎడ్యుకేషన్, లీగల్ ఎడ్యుకేషన్, తదితర అన్ని అంశాలపై సూక్ష్మంగా అవగాహన కల్పించే ఉద్దేశంతో ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. ముఖ్యంగా మహిళలకు సంఘంలో జరిగిన ఆర్థిక లావాదేవీలతోపాటు కుటుంబ బాధ్యతలలో మెళకువలు, పిల్లల చదువు, ఆరోగ్యం, భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత (శానిటేషన్ అండ్ హైజిన్) సామాజిక, సాంస్కృతిక, తదితర అన్ని అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులతోపాటు వివోఏలు మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ల్యాండ్ అక్విజిషన్ స్పెషల్ కలెక్టర్ లావణ్య

విశాలాంధ్ర - నరసన్నపేట: మండలంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ల్యాండ్ అక్విజిషన్ స్పెషల్ కలెక్టర్ లావణ్య ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే రమణమూర్తికి మొక్కను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతనిధుల గౌరవం పెంచేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని ఆమెకు సూచించారు.

'దీపావళి' అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి దీపావళి పండుగ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులకు, కూటమి నాయకులకు, అధికారులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కష్టాల చీకట్లు తొలిగి, ప్రజలందరి జీవితాల్లో సుఖ, సంతోషాలు నింపాలని, అలాగే పర్యావరణ అనుకూల దీపావళి సరదాల ఆనందాల మధ్య జరుపుకొని, మన హిందూ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనం చాటాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన డ్వామా పి.డి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం / కవిటి : జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి. సుధాకర్ రావు బుధవారం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన పి.డి. నియోజకవర్గంలో డ్వామా ద్వారా చేపట్టబోయే ప్రాజెక్టుల గూర్చి చర్చించారు. ఉపాధి హామీ పథకానికి లోబడి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె ప్రజల అభ్యున్నతికి ప్రగతికి తోడ్పడేలా పనులను సాగించాలని కోరారు.

తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలు

డిసిసిబి డిజిఎం బసవలింగం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలు డిసిసిబి బ్యాంక్‌ల ద్వారా రైతులకు అందించటం జరుగుతుందని, ఇటువంటి అవకాశాన్ని రైతులు వినియో గించుకోవాలని డిసిసిబి డీజీఎం బసవలింగం అన్నారు. బుధవారం సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో మహిళల ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని అన్నారు. తమ బ్యాంకు ద్వారా సీనియర్ సిటిజన్‌కు, 10 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రత్యేక డిపాజిట్ పథకం ఉందన్నారు. దీపావళి సందర్భంగా ధనవర్ష పథకం ప్రవేశపెట్టామని, దీనిపై 333 రోజులకు 7.5% ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మలి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఉషా శాంతి, సూపర్ వైజర్ రవిచంద్ర, సిబ్బంది నాయుడు, భవాని, శ్రీనివాస్ రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎవరిదో ఈ అఘాయిత్యం..?

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పట్టణం నడిబొడ్డున మురికి కాలువలో కనిపించిన ఓ పసిబిడ్డ మృతదేహాన్ని చూసి ప్రతి ఒక్కరు అయ్యో పాపం అంటూ ఆ కసాయి తల్లి కర్కశ చర్యను ముక్తకంఠంతో ఖండించారు. నవమాసాలు మోసి జన్మనిచ్చిన బిడ్డను తన పొత్తిళ్లలో పెంచి పెద్ద చేయాల్సిందిపోయి చేతులారా అప్పుడే జన్మించిన ఆ బిడ్డను మురికి కాలువలో పడవేయడం సోంపేటలో చర్చనీయాంశమైంది. పట్టణంలోని జాలారీవీధి పక్కనే ఉన్న శ్రీనివాస విద్యానిలయం సమీపంలో గల మురికి కాలువలో అచేతనంగా పడి ఉన్న పసిబిడ్డను బుధవారం కొందరు వ్యక్తులు చూడడం, ఈ సమాచారం సమీప వీధుల్లో చాలా మందికి తెలయిడంతో వారంతా వచ్చి ఈ ఘటనను చూసి చలించిపోయారు. ఇంత కర్కశానికి పాల్పడింది ఎవరా అంటూ చర్చించుకున్నారు. సమాచారం పోలీసులకు తెలియడంతో సోంపేట ఎస్సై హైమావతి ఘటనా స్థలానికి చేరుకుని పసిబిడ్డ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ శవపంచనామా నిర్వహించిన అనంతరం సిబ్బంది సహాయంతో ఖననం చేయించారు. దీనిపై ఎస్సై హైమావతి మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే పేరేడ్‌కు గణేష్

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సీ(ఎంపిసిఎస్) తృతీయ సంవత్సరం చదువుతున్న విధ్యార్థి, పి.గణేష్, మహరాష్ట్రలోని జల్‌గాన్ నందు నిర్వహించ బడుతున్న పశ్చిమ జోన్, ఎన్.ఎస్.ఎస్ విధ్యార్థుల ప్రీ రిపబ్లిక్ డే పేరేడ్ శిక్షణా కార్యక్రమానికి ఎంపికైనాడని కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే నవంబర్ 12వ తేదీ నుండి 21వ తేదీ వరకూ నిర్వహించబడుతుందని అన్నారు. ప్రీ రిపబ్లిక్ డే పేరేడ్‌కు ఎంపికైన గణేష్‌కు కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత, ఎన్ఎస్ఎస్ పివోలు, డి.ఢిల్లేశ్వరరావు, నాగరాజు, కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలియచేశారు.

జగతిని జాగృతం చేసే దీప్తుల శోభావళి

- రవీంద్రభారతిలో దీపావళి సంబరాలు

విశాలాంధ్ర - ఆమదాలవలస: జగతిని జాగ్రత్తగా చేసి దీపాలంకరణలతో గృహాలను శోభాయమానంగా చేసే చైతన్య దీప్తుల శోభావళి ఈ దీపావళి అని రవీంద్ర భారతి ప్రిన్సిపాల్ యం.టినేష్ అన్నారు. స్థానిక ఆమదాలవలస రవీంద్రభారతి పాఠశాలలో దీపావళి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వస్త్రాలంకరణ, వేషధారణలు, రంగు రంగుల రంగవల్లికలు, దీపకాంతులు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలని, వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి అన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ యన్.వెంకటేష్, సీజీఎం జీ.ఆర్.వసంత, పాఠశాల చిన్నారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- ఉద్యాన సహాయకులు లలితాకుమారి

విశాలాంధ్ర - కవిటి: కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన సహాయకులు లలితకుమారి రైతులకు సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని లొల్ల పట్టుగ, కర్రివానిపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంట నమోదు చేసుకున్న రైతులుకు పంట నమోదు రశీదులు అందజేశారు. ఉద్యాన సహాయకులు లలితా కుమారి కొబ్బరి పంట పరిశీలించి కొబ్బరికి ఆశించిన పురుగులు గుర్తించి మొవ్వుకుల్లు తెగుళుకు బ్లేయిటాక్స్ 3 గ్రాములు లీటర్ నీటికి మొవ్వు తొడిచేటట్లు, ఎఱ్ఱముక్కు పురుగు నివారణకు ట్రాప్‌లు అమర్చుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సింహాచలం, అమూల్య, వెటర్నరీ అసిస్టెంట్ నీలవేణి, రైతులు లొల్ల శ్రీనివాసరావు, లోల్ల కింగ్, కృష్ణారావు, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షలతో సిమెంట్ రహదారి నిర్మాణం

విశాలాంధ్ర-కంచిలి: కంచిలి మండలం జలంత్రకోట గ్రామంలో రజకవీధిలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రెండు లక్షల రూపాయలతో సిమెంట్ రహదారి నిర్మాణం బుధవారం చేపట్టారు. టీడీపీ, జనసేన ముఖ్యనేతలు మాదిన రామారావు, బ్రహ్మ, హరిబాబు, సంజయ్, రాజేష్ తదితరులు హాజరై రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పాఠశాల విద్యార్థులకు పరికరాలు అందజేత

విశాలాంధ్ర-సోంపేట: మండలం సిహెచ్ గొల్లగండి ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 130 మంది విద్యార్థులకు బుధవారం విద్యాసామాగ్రిని అందజేశారు. గండుపల్లి సోమేశ్వరరావు, గీత దంపతుల కుమార్తె ఇషా మొదటి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్సిల్ కిట్లు, కాంపాక్స్ బాక్సులు అందజేశారు. పుట్టినరోజు వేడుకలు విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది సోమేశ్వరరావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇషాకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గండుపల్లి చిన్న రాజారావు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శభాష్ నందు

విశాలాంధ్ర-కంచిలి: మండలం చౌట్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ఉలాల నందును అనేక మంది శభాష్ అంటూ ప్రశంసించారు. ఇదే మండలం నువాగడ గ్రామంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన గణిత అవధానంలో నందు తన మేధస్సును చాటుకున్న తీరు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపర్చింది. గణిత అవధాని మద్దు తిరుపతిరావు నిర్వహించిన అవధానంలో నందు ఘనమూలం, వారగణన, మనోసంకలనం, గణిత చదరం, తదితర అంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై అడిగిన అనేక ప్రశ్నలకు ఎటువంటి తడబాటు లేకుండా సమాధానాలు చెప్పిన తీరు అందరినీ ఆశ్చర్యపర్చింది. విద్యార్థి నందును ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాడి, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక బహుమతులు ఇచ్చి సత్కరించారు. అవధాని తిరుపతిరావును సన్మానించారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం, జగ్గయ్యపేట గ్రామానికి చెందిన తర్ర దాలినాయుడును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించారు. ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సత్రాం గ్రామానికి చెందిన గుండ ధర్మారావు, తవిటమ్మ ఇద్దరు భార్యాభర్తలు రెండు రోజులు వ్యవధిలో మృతి చెందారని తెలుసుకొని వారిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశువుల గర్భకోశ వ్యాధుల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-జలుమూరు: కిన్నెరవాడ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడల ప్రదర్శన, పశువులకు గర్భ కోశ వ్యాధుల నివారణ కోసం పాడి రైతులకు అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, వైద్యుల సూచన మేరకు సరైన సమయంలో టీకాలు వేయించి, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దేశవాళీ, హైబ్రిడ్ జాతుల పశువుల పెంపకం ద్వారా పాల దిగుబడి పెరగాలని, తద్వారా పాడి రైతులు లాభపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా. మురళీధర్, డా. వి.జయరాజు, ఏ.డి.లోకనాథం, డా. సి. హెచ్.కిషోర్ కుమార్, పశు వైద్య సిబ్బంది, ఎంపీపీ చిన్నాల కుర్మినాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా సామగ్రి వద్ద కిటకిటలాడిన ప్రజలు

విశాలాంధ్ర-జలుమూరు: దీపావళి పర్వదిన సందర్భంగా జలుమూరు మండలం లింగాలవలస పంచాయతీ హరికృష్ణమ్మ పేట ప్రాంతంలో విజయలక్ష్మి బాణా సామాగ్రి అమ్మకాల వద్ద వందల సంఖ్యలో ప్రజలు సామాన్లు కోసం నిరీక్షించారు. ధరలు ఎంత ఉన్నా ఏమైనా సామాన్లు కావాలని ప్రజలు తహతహపడ్డారు.

కణితి తొలగింపునకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటి: స్థానిక మండపం వీధిలో నివాసం ఉంటున్న పొల్లాయి మండల విగ్నేష్ కుమార్తె కుమారి కడుపులో కాయ తొలగింపునకు గ్రామ అభివృద్ధి సంఘం తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించింది. కొద్దిరోజులుగా ఆమె తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ ఆసుపత్రికి చేరింది. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు కడుపులో ఉన్న కణితి క్యాన్సర్ రూపంలో ఉందని స్పష్టం చేశారు. ఆ క్యాన్సర్ కాయతోపాటు, గర్భసంచిని కూడా తొలగించాలని వైద్యులు సూచన చేసినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామ అభివృద్ధి సంఘం బాధితురాల వైద్యం కోసం రూ.26వేల నగదును బుధవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పూడి లక్ష్మణరావు, పాండవ చంద్ర శేఖర్, ఆరంగి మధు, పోల్లాయి లక్ష్మణమూర్తి, పోల్లాయి ఉమామహేశ్వరరావు, మొగిలిపురి నాగేశ్వరరావు, ఆరంగి రాజు, బెందాళం సురేష్, తెప్పల మోహన్ రావు, పోల్లాయి సింహాచలం, మొగిలిపురి సీతారాం, గొరకల రామారావు, తెప్పల దశరథ, పోల్లాయి ఉమాపతి, పోల్లాయి డిల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న సంపతిరావు దివ్య(28) అనే వివాహిత బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. మృతురాలు గత కొన్నాళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతురాలు భర్త శ్రావణ్ కుమార్ టెక్కలి తహశీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటన పై ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రిలే రేస్ పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఈ నెల 25, 26 తేదీల్లో కర్నూల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్టీఎఫ్ రిలే రేస్ పోటీల్లో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం క్యాంపస్లో పీయూసీ చదువుతున్న విద్యార్థి ఆర్. శివసాయి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విద్యార్థి ప్రతిభను క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి. ఎవ్వో వాను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, వర్సిటీ ఎస్వో డాక్టర్ కె. సామ్రాజ్యలక్ష్మి, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గ్యాస్ లేక..
ఉచిత గ్యాస్‌కు దూరమవుతున్న వినియోగదారులు

విశాలాంధ్ర - పలాస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ పథకంను పలాస నియోజకవర్గంలో వందలాది మంది నిరుపేద వినియోగదారులు దూరమవుతున్న పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్‌ను వినియోగదారుడు పొందాలంటే వారి వద్ద ఖాళీ గ్యాస్ బండ అదనంగా ఉండాలని ఆ పరిస్థితి చాలా మంది వద్ద లేదని పేద, మధ్య, బడుగు వర్గాల వారు వాపోతున్నారు. బియ్యం కార్డులు ఉన్న వినియోగదారులు చాలా మందికి వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా ఉచిత గ్యాస్ పొందాలంటే గ్యాస్ బండలు అదనంగా ఇళ్లల్లో ఉండాలి. కొంతమంది ఇళ్లల్లో గ్యాస్ బండలు అదనంగా లేకపోవడంతో పాటు ఖాళీ దిమ్మలు కొనుగోలు చేయాలంటే ఆర్థికపరమైన సమస్యలు ఉండటంతో వందలాది మంది పేదలు ఉచిత గ్యాస్ ను ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకోలేకపోతున్నారు. అంతేకాకుండా ఇప్పటికీ రేషన్ కార్డులు మంజూరు కాక ఎదురుచూస్తున్న వారితో పాటు వారసత్వంగా సంక్రమించాల్సిన గ్యాస్ కనెక్షన్ హక్కు పత్రాలు లేక అనేకమంది ఉచిత గ్యాస్ పథకానికి దూరమయ్యారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఈ విధంగా చర్యలు తీసుకుంటారని కొంతమంది వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

విశాలాంధ్ర - పలాస: రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతామని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కాశీబుగ్గ, రూరల్ సిఐలు డి మోహనరావు, ఎం తిరుపతిలు అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శ్రీకాకుళం జెమ్స్ , రిమ్స్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, వైద్య శిబిరంలను సిఐలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడంపై చాలామందికి అపోహలు ఉన్నాయని రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రోడ్డు ప్రమాదం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్త దానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని స్పష్టం చేశారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో 34 మంది పోలిస్ అధికారులు, సిబ్బంది, ఇతరులు రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేమ్స్ హాస్పటల్ మేనేజర్ చిన్నారావు, మార్కెటింగ్ ఏరియా మేనేజర్ రాపాక. తిరుపతిరావు, వైద్యులు, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యానర్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: క్యానర్స్ వ్యాధిపై విద్యార్థులు కల్గివుండాలని, అలాగే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ(సిసిఎంబి)కు చెందిన పరిశోధకులు, తమ్మినేని యతిరాజు అన్నారు. బుధవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి విద్యార్థులకు వివరించారు. మన దేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు బాధపడుతున్నారని, లంగ్స్, బ్రెస్ట్, నోరు, గర్భాశయ, కడుపు, అన్నవాహి, లివర్ క్యాన్సర్‌తో ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్‌ను ప్రతీ ఒక్కరూ నివారించవచ్చని తెలిపారు. అనంతరం బోటనీ అధ్యాపకుడు, డి.బాబ్జీ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి అతి ప్రమాదకరమైనదని, దీనిపై అపోహలు ఉన్నా వాటిని నివృత్తి చేసేందుకు చేపడుతున్న ప్రభుత్వ, ఎన్జీఓ కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇంఛార్జ్, మూకళ్ల శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గాయపడిన విద్యార్థి

విశాలాంధ్ర-ఆమదాలవలస: స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థి బుధవారం వీధి కుక్కల దాడిలో గాయ పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండవ తరగతి చదువుతున్న పైడి ధరన్ తులసి నాథ్ తో పాటు పాఠశాల విడిచిపెట్టిన తర్వాత ఇంటికి వస్తున్న సమయంలో వీధి కుక్కలు దాడి చేయడంతో ఈ ప్రమాదం సంభవించింది. కొంతమంది విద్యార్థులు కుక్కల బారిన పడకుండా తప్పించుకుపోగా తులసీనాథ్‌పై కుక్కలు దాడి చేసి చేతిని గాయపరిచాయి. కుక్కల దాడిలో గాయపడిన విద్యార్థిని తల్లిదండ్రులు జొన్నల వలస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లి దండ్రులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాల సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో ప్రతిరోజు వీధి కుక్కలు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ దాడులు చేస్తున్న మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వాటర్ ట్యాంక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పదుల సంఖ్యలో కుక్కలు గుమికూడి ఉన్నప్పటికీ పుర పాలక సంఘ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గత కమిషనర్ ఆపరేషన్ డాగ్ కార్యక్రమంలో భాగంగా 198 కుక్కలను తరలించినట్లు చెబుతున్నారే గాని అటువంటి దాఖలాలు ఎక్కడా కనిపించలేదని స్థానికులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫల మయ్యారనే చెప్పాలి. కుక్కల బారిన పడి గాయాలైన వారు ప్రతిరోజు ఆసుపత్రిలో పదుల సంఖ్యలో చేరుతున్నట్లు ఆసుపత్రి రికార్డులు చెబుతున్నాయి. జొన్న వలసలో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి కారణంగా రెండు కుటుంబాల మధ్య వాదన జరిగింది .ఆ తగవు పోలీస్ స్టేషన్ వరకు వచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితి నుంచి ప్రజలకు భయాందోళనలు తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకోవాలి

- స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: జిల్లా ప్రజల జీవితాలలో దీపావళి వెలుగులు నిండాలని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటనను బుధవారం విడుదల చేశారు. నేటి దీపావళి పండగను ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకోవాలని, అదే సమయంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా సంప్రదాయ పద్ధతిలో దీపావళి పండుగను వేడుకగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. దీపావళి అంటే దీపాల వరుస అనే అర్థం అని, పెద్దపెద్ద బాంబుల మోత కాదు అని తెలిపారు. వీలైనంతవరకు కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని ఆకాంక్షించారు. బాణసంచా కాల్చే క్రమంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరపాటు, నిర్లక్ష్యం వహించినా తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలు, యువత తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అధికారులకు, అనధికారులకు, అభిమానులకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ మద్దతుదారులకు, పాత్రికేయులకు నియోజకవర్గ ప్రజలకు అందరికీ దీపావళి శుభాకాంక్షలను తెలియజేశారు.

సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్య దేవత విశాఖపట్నం బురుజుపేటలో కొలువుతీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పరిశీలించారు. బుధవారం దేవాలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఇతర అధికారులతో దేవాలయ ప్రాంగణంలో క్యూలైను ,బయటకు వెళ్లే మార్గము, రహదారులను పరిశీలించారు. గత ఉత్సవం దృష్టిలో ఉంచుకొని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయుటానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. అదేవిధంగా మార్గశిర మాసంలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న అవకాశం ఉన్నందున, వారికి కనీస వసతులులైన క్యూలైన్లు చలువ పందిళ్ళు ,త్రాగునీరు సరఫరా మహిళల ఉన్నవి ఏర్పాట్లు చేయమని సూచించారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి దేవుడు బాబు ,సిఐ సింహాద్రి నాయుడు, స్థానిక కార్పొరేటర్ నరసింహాచారి, పోలీసు అధికారులు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కే శోభారాణి ,కార్యనిర్వాహ ఇంజనీర్ సిహెచ్ వి రమణ, సహాయ కార్యనిర్వాహణాధికారి తిరుమలేశ్వరరావు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాడుబడిన బావిని వినియోగంలోకి తెచ్చిన సర్పంచ్

విశాలాంధ్ర-సంతబొమ్మాలి : సంతబొమ్మాలి పంచాయితీలో కల తెనిగిపెంట గ్రామంలో చాలా కాలంగా పాడుబడిన బావిని సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అప్పారావు వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రజలకు అవసరమైన మంచినీటి బావి పూర్తిగా నాచుతో నిండిపోయిందని వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరారని సర్పంచ్ తెలిపారు. దీంతో ఆర్ డబ్ల్యు యస్ అధికారులను కలసి, బావి పూడిక తీయించాలని చెప్పిన వెంటనే, పేరుకుపోయిన నాచు తీయించి, బ్లీచింగ్ పౌడర్ వేయించి వినియోగంలోకి తీసుకురావటం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ మహేష్, మండల పంచాయితీ కార్యదర్శిల సంఘము అద్యక్షులు, సంతబొమ్మాలి పంచాయితీ కార్యదర్శి, దుంపల శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టంట్ ఝాన్సీ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందాలి

నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వి.ఉజ్వల్

విశాలాంధ్ర-నరసన్నపేట: దేశంలోని యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందాలని, యువత కోసమే మేరా యువ భారత్ పేరిట ఒక స్వయంప్రతిపత్తి సంస్థను కేంద్రం ఏర్పాటు చేయబోతోందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి, కె.వెంకట ఉజ్వల్ అన్నారు. మంగళవారం భారత ప్రభుత్వం, యువజన వ్యవహారములు, క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, న్యూ ఢిల్లీ వారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల, ఎల్.వి.ఆర్ డిగ్రీ కళాశాల సంయుక్త సహకారంతో యూలపేట, వివేకానంద యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నా భారత్‌తో దీపావళి మేరా యువ భారత్ మొదటి వార్షికోత్సవ వేడుక సంధర్భంగా పట్టణంలో ట్రాఫిక్, వాలంటరీ మార్కెట్ క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంధర్భంగా నెహ్రూ యువ కేంద్ర అధికారి, కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ యువత తమకు కావాల్సిన అవకాశాలను పొందటంతో పాటు సుసంపన్న భారత్ ఏర్పాటుకు ప్రభుత్వానికి, పౌరులకు మధ్య వారధులుగా వ్యవహరిస్తారని తెలియచేశారు. అంతేకాక భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేధాలను విస్మరించి, సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి పండుగ అని అన్నారు. అనంతరం సిఐ, జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతీ వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, వాహనం నడిపే ప్రతి వ్యక్తికీ హెల్మెట్ ఉండాలన్నారు. లైసెన్స్ లేనివారికి వాహనం ఇవ్వరాదని, వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్, సెట్‌శ్రీ సూపరెండెంట్, ఎల్.రేఖ, ఈవో, పి.ద్రాక్షాయిణి, నెహ్రూ యువ కేంద్ర అకౌంట్స్ సహాయకులు, డి.శ్రీనివాసరావు, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, మూకళ్ళ శ్రీనివాసరావు, ఎల్వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఎం.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, ఎం. మోహనరావు, కె.రాము, సిఎంఆర్ మేనేజర్, జ్వానిభాష, వివేకానంద సేవా సంఘ కార్యవర్గ సభ్యులు, ఉమామహేశ్వరరావు, జి.వి.రమణ, సుమతి మోహనరావు, ఎన్.వై.వి, విధ్యార్ధినీ, విధ్యార్ధులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనతోనే సమాజ శ్రేయస్సు

డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ

విశాలాంధ్ర-ఆమదాలవలస: అవినీతి రహిత సమాజ నిర్మూల నే లక్ష్యంగా యువత పనిచేయాలని తొగరాం డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, తొగరాం సౌజన్యంతో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీ లు విద్యార్థులకు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి అవినీతి పెద్ద ఆటంక కారి అని దీనిని నిర్మూలించే బాధ్యత విద్యార్థులు, యువతరం పై ఉందని తెలిపారు. అవినీతిని నిరోధించడంలో అవగాహన కలిగి ఉండాలని అందులో విద్యార్థినీ విద్యార్థులు పాత్ర అభినందనీయ మని బ్యాంకు మేనేజర్ బి సత్య నారాయణ తెలిపారు. జాతీయ సమగ్రతను పెంపొందించడంలో భావిభారత పౌరులందరూ సన్నద్ధంగా ఉండాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి రామారావు పేర్కొన్నారు. భారతీయులు కొందరు అవినీతిలో పుట్టి అందులోనే పెరిగి, జీవించి మర ణిస్తూ అవినీతినే తన వారసులకు అందించే దు స్సంస్కృతి ఉండటం బాధాకరమని ఐక్యూ ఏసి సమన్వయకర్త డాక్టర్ పైడితల్లి పేర్కొన్నారు. కార్య క్రమంలో అవినీతి నిర్మూలన అనే అంశంపై నిర్వ హించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ప్రథమ బహుమతి దీపిక, ద్వితీయ బహుమతి రజిని మరియు తృతీయ బహుమతి రవిత్రయని మరి యు పార్టిసిపెంట్స్ కి కన్సిలేషన్ ప్రైసెస్ బ్యాంకు మేనేజర్ మరియు ప్రిన్సిపల్ అందించారు. ఈ సందర్భంగా అవినీతి నిర్మూలనపై విద్యార్థిని విద్యార్థులు మరియు ఇతర సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమ నిర్వహణ మరియు న్యాయ నిర్ణేతలుగా ఆంగ్ల అధ్యాపకులు సీతారాం, తెలుగు అధ్యాపకులు వి అచ్యుతరావు వ్యవహ రించారు. బ్యాంకు క్యాషియర్ ప్రదీప్, ఫీల్డ్ ఆఫీ సర్ భరత్ రెడ్డి, అధ్యాపకులు బి శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, కాశీరత్నం, హారిక, వై రమణమూర్తి, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రవిబాబు, పూర్ణిమ, చంద్రశేఖర్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యూటిఎఫ్ మండల మహాసభ

మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా జగదీష్, సీతంనాయుడు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ఆర్ బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో యుటిఎఫ్ కవిటి మండల శాఖ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూ టి ఎఫ్.మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా జగదీష్, సీతంనాయుడు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా ఎల్ బాబురావు ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి ఎం.మురళి ప్రకాష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సభలో జిల్లా అధ్యక్షులు ఎల్.బాబురావు స్వర్ణోత్సవ మహాసభలలో భాగంగా జిల్లాలోని నందిగామ మండలంలో జరగబోయే సాంస్కృతిక పోటీలను జయప్రదం చేయాలని వారు కోరారు. అలాగే ఎంపికైన నూతన కమిటీ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పై యాపుల భారం తగ్గించాలని,ఐ ఆర్ వెంటనే ప్రకటించాలని పిఆర్సి అమలు చేయాలని కోరారు. అలాగే సిపిఎస్ రద్దు చేయాలని అన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొరకు ఓటర్ నమోదు చేసుకోవాలని అన్నారు. చివరి తేదీ నవంబర్ 6గా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జానకిరావు, మామిడి శ్రీను, కొర్రాయి రామారావు, నారాద కామేష్, జుదిష్టి రౌలో, అశోక్, ఏవి రమణ, రవిబాబు, త్రినాధనాయుడు, కె. కృష్ణారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె పుట్టినరోజున ఓపచ్చని చెట్టుకు జీవం

విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరుకు చెందిన మాజీ ఏ.ఎం.సి ఛైర్మెన్ గోగుల మాధవి వరప్రసాద్ నాయుడు కుమార్తె. పుట్టిన రోజున బాలిక చదువుతున్న పాఠశాలలో ఒక మొక్కను ఆ బాలిక చేత నటించారు. ఈ సందర్భంగా గోగుల మాట్లాడుతూ మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్య నియంత్రణకి ప్రతి విద్యార్థి కూడా వారి వారి జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రతి ఒక్కరు కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేసి దేశవ్యాప్తంగా కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు కూడా తోడ్పాటు అందిస్తారని గోగుల వర ప్రసాద్ నాయుడు అన్నారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో హిరమండలం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతినిధి గోగుల వర ప్రసాద్ నాయుడు, మహర్షి విద్యాలయ ప్రిన్సిపాల్ ముగితి రాంబాబు, మరియు లోతుగడ్డ కన్నబాబు, పెదకోట రామారావు తో పాటు పిన్నింటి రామారావు నాయుడు, జడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

విశాలాంధ్ర-హిరమండలం: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి కీ 62 సంత్సరాలు పై బడినచో పదవి విరమణ తప్పదని హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పి రాంబాబు అన్నారు. బుధవారం హిర మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి ఈశ్వర సత్యన్నారాయణ పట్నాయక్ పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పెద్దలు ఘనంగా ప్రిన్సిపాల్ పి ఈ ఎస్ పట్నాయక్ ను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ 38 సంత్సరాలు సుదీర్ఘంగా కళాశాలల్లో పని చేసి ఎందరో విద్యార్థులను ఉన్నత ఉద్యోగాల్లో కొలువులు తీర్చేలా తీర్చిదిద్దారని వృత్తి పట్ల ఎంతో అంకితభావంతో పని చేశారని కొనియాడారు. ఇకనైనా ఇంటి పట్టు ఉండి కుటుంబసభ్యులుతో సంతోషం గా గడపాలని వారి కుటుంబసభ్యులు ఆయనను కోరారు. సురంగి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా సభ్యత్వ నమోదు చేసుకోవాలంటూ పిలుపు

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించినటువంటి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశాలు మేరకు మండలంలో అయోధ్యపురం పంచాయతీలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టిడిపి పార్టీ సభ్యత్వం త్వరగా నమోదు చేసుకోవాలని, పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వం పొందిన వారికి ఐదు లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తునట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బగాది హరి, డెంకాడ అప్పలస్వామి, అయోధ్యపురం పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- బెలగాం : ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారి మృతదేహాలను వారి ఇళ్లకు చేర్చడానికి బుధవారం జిల్లా ఆసుపత్రి వద్ద నూతనంగా సిద్ధం చేసిన మహాప్రస్థానం వాహనాన్ని ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మహాప్రస్థానం వాహనం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా మృతదేహాన్ని తరలించేందుకు జిల్లా ఆస్పత్రిలో పేదలు చాలా ఇబ్బందులు పడేవారని, మృతదేహాన్ని తరలించడానికి ఎంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డారని దానిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం జిల్లా ఆస్పత్రికి మహాప్రస్థానం వాహనం కేటాయించిందన్నారు. దీనివలన పేద కుటుంబాల వారికి మృతదేహాన్ని తరలించేందుకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరెంటెండెంట్ డా. బి. వాగ్దేవి, జిల్లా వైద్య ప్రోగ్రాం ఆఫీసర్ డా. మంతిని వినోద్ కుమార్, వైద్యులు డా. శ్రీధర్,డా. వెంకట్రావు, టిడిపి సీనియర్ నాయకులు మజ్జి వెంకటేష్, డా. భాను ప్రసాద్, టిడిపి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులతో పల్లెలకు మహర్దశ

డ్వామా పిడి బి సుధాకరరావు

విశాలాంధ్ర-పలాస: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెలకు మహర్దశ అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి. సుధాకర్ రావు అన్నారు. బుధవారం పలాస మండలం లక్ష్మీపురం గ్రామంలో 14 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీట్ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో రహదారులు కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం వలన పరిశుభ్రకరమైన వాతావరణం ఏర్పడడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగవుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మెటీరియల్ కాంపోనెంట్ పనులను చేపడుతున్నామని, ఈ పనుల్లో నాణ్యతకే అగ్రతాంబూలం వేస్తామన్నారు. పనులను నిరంతరం పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నివేదికను కార్యాలయానికి అందించాలని సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనులన్నీ వీలైనంత తొందరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి వెంట ఏపిఓ నారాయణరావు, ఈసీ అమ్మినాయుడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల బాధ్యత కీలకం

విశాలాంధ్ర-పలాస: విద్యార్థుల జ్ఞాన సముపార్జనతో పాటు వారి అభివృద్ధిలో అధ్యాపకుల పాత్రతో పాటు తల్లితండ్రుల బాధ్యత కూడా కీలకమని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకుల బోధనతో విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రథమ స్థానాలను అందుకుంటున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠశాల నుండి ఇంటికి వచ్చిన తరువాత వారి కదిలికలపై తల్లిదండ్రుల దృష్టి పెట్టాలని, ప్రతిరోజు చదివే విధంగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా బాధ్యత ఉందని ఆ దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంసీ బాడ వెంకటమోహన్, సీనియర్ అధ్యాపకుడు పి.చిరంజీవులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

విశాలాంధ్ర-టెక్కలి : ఎన్.ఎస్.ఎస్.సెల్, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్రీయ ఏక్తాదివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి సతీష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ వి లూక్ పాల్ ముఖ్య అతిథిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఘనతను వివరించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి టి.త్రినాధరావు, ఎన్.ఎస్.ఎస్ పీవోలు డి.వాసుబాబు, కే గొల్ల, హిస్టరీ విభాగాధిపతి కోటేశ్వరరావు, ఒరియా విభాగదిపతి డాక్టర్ జగన్నాథ్ బిసై, డాక్టర్ ఎస్.ధర్మారావు, కే శ్రీనివాసరావు ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో ఘనంగా దీపావళి వేడుకలు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక రవీంద్ర భారతి స్కూల్లో బుధవారం దీపావళి వేడుకలను డీన్ నాగరాజు, ప్రిన్సిపల్ పద్మజ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా స్కూల్ ఆవరణంలో దీపావళి పండగ యొక్క ముగ్గులను అందంగా వేసి బంతిపూలతో అలంకరించి వాటి మధ్యలో దీపాలను వెలిగించారు. దీపావళి యొక్క విశిష్టతను తెలిపే అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ పద్మజ దీపావళి యొక్క గొప్పతనాన్ని వర్ణిస్తూ మాట్లాడారు. మందుగుండి సామాగ్రి కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ఉపయోగిస్తూ తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. దీపావళి పండగ ప్రతి ఇంట ఆనందాలు నింపి, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత దీపావళి పండుగను జరుపుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ కణితి కిరణ్ కుమార్.

విశాలాంధ్ర-టెక్కలి: వికసించిన కాంతుల దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంతో సంతోషంగా జరుపుకోవాలని జనసేన నాయకులు, టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ కణితి కిరణ్ కుమార్ అన్నారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత దీపావళి పండుగను జరుపుకోవాలని తెలిపారు. వైకాపా చీకటి పాలన తొలగి కూటమి ప్రభుత్వ వెలుగులు ప్రతి ఇంట కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రజలలో ఆనందం నింపే విధంగా దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో పర్యావరణాన్ని పెంపొందించేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని, అందులో భాగంగా పల్లె పండగ పేరుతో గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి సారించారని స్పష్టం చేశారు. దీపావళి పండగ ప్రతి ఇంట ఆనందాలు నింపి వారి జీవితాల్లో సుఖశాంతులు కలిగించాలని కిరణ్ ఆకాంక్షించారు. చిన్నారులు జాగ్రత్తలు పాటిస్తూ కాటన్ దుస్తులు ధరించి దీపావళిని జాగ్రత్తగా, ఆనందంగా ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

ఆనందోత్సాహాల మధ్య ముందస్తు దీపావళి వేడుకలు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కవిటిలో శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్,ఎస్ వి జె విద్యాసంస్థలు, కే కొత్తూరులో ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలల ప్రాంగణంలో ముందస్తు దీపావళి వేడుకలు విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగురంగుల ముగ్గులు వేసి వాటిపైన దీపాలు వెలిగించి అనంతరం నరకాసురుని బొమ్మకు బాంబులు అగాధీలతో దహనం చేశారు. విద్యార్థులు హ్యాపీ దివాలి అంటూ నినదిస్తూ మందు కొండ సామాగ్రి కాల్చి ఒకరికి ఒకరు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దీపావళి విశిష్టత నరకాసురుని సంహారను విశిష్టతను విద్యార్థులకు కళ్యాణి స్కూల్ ప్రిన్సిపాల్ బిందు మాధవి, రాష్ట్ర విజ్ఞాన భారతీయ ప్రిన్సిపల్ అనిల్ కుమార్, ఎస్విజే విద్యాసంస్థలు డైరెక్టర్లు ఝాన్సీ రాణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రాణి, సంతోష్, రాము, సురేంద్ర, శ్రీదేవి, శ్రావణి, ఆమూల్య తోపాటు ఇతర ఉపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ను సందర్శించిన మంత్రి రవీంద్ర

విశాలాంధ్ర-విశాఖపట్నం : మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర విశాఖ పర్యటనలో భాగంగా ఆంధ్ర యూనివర్సిటీలోని ఏపీ ఎక్సైజ్ %ఙ% ప్రొహిబిషన్ శాఖకు చెందిన ల్యాబ్ ను సందర్శించారు. ల్యాబ్ లో జరుగుతున్న నాణ్యత పరీక్ష వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యమంలో పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌కి మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా యూనివర్శిటీ టీఎన్టీయూసీ శాఖ సలహాదారుడు ఆవల రమేష్ కలసి అభినందనలు తెలియజేశారు. మంత్రి రవీంద్ర రమేష్ ని ఉద్దేశించి పార్టీని అన్ని విధాలా బలోపేతం చేసి లోకేష్ నాయకత్వాన్ని సమర్థించి ముందుకు సాగాలని సూచించారు. పార్టీ అన్నివేళలా మీ కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చారు.

క్రియాశీల సభ్యత్వం తీసుకున్న ఎన్ఈఆర్

విశాలాంధ్ర-రణస్థలం: విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు మరియు ఎచ్చెర్ల శాసనసభ సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు అధ్యక్షతన ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం లో సభ్యత్వ నమోదు ప్రక్రియ మరింత వేగంగా చేయటం, క్రియాశీల సభ్యత్వాలు ఇవ్వటం, జిల్లా లో అన్ని మండలాలకు సంస్థాగత ఎన్నికల అధికారుల నియామకం పై చర్చించారు. ఈ కార్యక్రమం లో విజయనగరం జిల్లా బీజేపీ సంస్థాగత ఎన్నికల అధికారి పైడి వేణు గోపాలం, జిల్లా సహ ఎన్నికల అధికారి కూనుమంచి సుబ్బారావు, జిల్లా క్రియాశీల సభ్యత్వ ప్రముఖ్ రెడ్డి పావని, సహ ప్రముఖులు సంబర లక్ష్మి నరసింహం, సంపతిరావు నాగేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రాజేష్ వర్మ, మండల అధ్యక్షులు మరియు పై స్థాయి నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ కార్యదర్శి ముందు సమస్యల వెల్లువ

విశాలాంధ్ర-జలుమూరు : మండల కేంద్రం సారవకోట లో చరిత్ర కలిగిన గ్రంథాలయంగా జిల్లా నలుమూలల గుర్తింపు పొందిన ఈ గ్రంథాలయ అభివృద్ధికి జిల్లా స్థాయి నేతలు గ్రంథాలయ సంస్థ అధికారులు సహకరించి అభివృద్ధి చేయాలని స్థానిక పాఠకులు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కే కుమార్ రాజా దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం సారవకోట గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయనకు ఇక్కడ పాఠకులు సమస్యలు, పని వేళలు మార్చమని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ పరంగా దీనిని అభివృద్ధి చేయవలసిన బాధ్యత మీపై ఉందని పాఠకులు కోరారు. ఆయనతోపాటు గ్రంథాలయ అధికారిణి సాయమ్మ, సహాయ అధికారి రుష సింగ్, దుర్గా జి పాఠకులు ఉన్నారు.

మంత్రి లోకేష్ స్పందన పట్ల జాగృతి హర్షం

విశాలాంధ్ర-సోంపేట: రాష్ట్రంలో అనేక వర్గాల ప్రజలు కుల, ఆదాయ కుటుంబ సభ్యుల, బర్త్ సర్టిఫికేట్లు, భూమిహక్కు పత్రాలు మొదలైన వాటి కొరకు అధికారులు, సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేసే బదులుగా సరళమైన పద్ధతిలో ఇటువంటి సేవలు అందించేందుకు కృషి చేయాలని సోంపేట మండలానికి చెందిన జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి రాష్ట్ర ప్రభుత్వానికి గత నెల 13వ తేదీన లేఖ రాసారు. ఈ లేఖను పరిశీలించిన రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి వాట్సాప్ ద్వారా ఇటువంటి సేవలు పొందేందుకు మెటా సంస్థతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల రాంబుడ్డి గణపతి బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

నిరంజన్ ఖడంగాకు ఘన సత్కారం

విశాలాంధ్ర-సోంపేట : ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన హిందీ పండితుడు నిరంజన్ ఖడంగాను బుధవారం సోంపేటలో ఒరియా బ్రాహ్మణ సంఘం ఘనంగా సత్కరించింది. ఒరియా డిప్యూటీ డీఈఓ దుర్గాప్రసాద్ చౌదరి చేతుల మీదుగా దుశ్శాలువ కప్పి జ్ఞాపిక అందించి సన్మానించారు. భవిష్యత్తులో మరింత గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. నిరంజన్ ఖడంగా ఏళ్ల తరబడి హిందీ ఉపాధ్యాయునిగా పని చేస్తూ హిందీ ప్రచార కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రఘునాథ్‌పాడి, ఉపాధ్యక్షుడు నీలాచలం పండా, కార్యదర్శి నరహరిసాహు, కిషోర్ కుమార్, బృందావన్ సాహు, తదితరులు పాల్గొన్నారు.